సంపుటి :03 | సంచిక :82 | పేజీలు :06 | www.aksharadarbar.com

అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

శనివారం 2, మే 2026



# ప్రజల భద్రతకు పెద్దపీట

డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతల స్వీకరణ | 5

# ప్రజా హితమే లక్ష్యం..

## ప్రగతి దిశగా అడుగులు!

- 99 రోజుల 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'తో ప్రజల ముంగిటకే ప్రభుత్వం
- నేడు రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ స్థాయి సభలు
- రైతు సంక్షేమం కోసం ఈ నెల 4 నుండి 'రైతు వారోత్సవాలు' ప్రారంభం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం జిల్లాలో నియోజకవర్గ స్థాయి సమావేశాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. శుక్రవారం అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా ఉదయం వేళల్లోనే సభలు నిర్వహించాలని ఆదేశించారు. వరంగల్ పశ్చిమ సభ కలెక్టరేట్ లో, పరకాల సభ మహాదేవ ఫంక్షన్ హాల్ లో జరుగుతుందని వెల్లడించారు. అలాగే, మే 4 నుండి 9 వరకు జిల్లావ్యాప్తంగా 'రైతు వారోత్సవాలు' నిర్వహించనున్నట్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇకపై 'ప్రజావాణి'ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్ డీఓల ఆధ్వర్యంలో నిర్వహిస్తామని, దరఖాస్తులను 30 రోజుల్లోపు పరిష్కరించాలని స్పష్టం చేశారు.

– అక్షరదర్బార్, హనుమకొండ | 5





# కార్మికులకు అండగా ప్రభుత్వం

- రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ | 5
- జెండా ఆవిష్కరించి కార్మికులకు మే డే శుభాకాంక్షలు



# 7న స్టేషన్ ఘనపూర్‌కు భట్టి

- రూ.65 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఏర్పాట్లపై సమీక్షించిన ఎమ్మెల్యే శ్రీహరి, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

| 5



- పరామర్శించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

# అగ్నికి మొక్కజొన్న పంట ఆహుతి

| 5

అక్షర దర్బార్
Voice of the People



## శ్రామికుల హక్కులను హరించే పాలకులకు
# మేడే జరిపే నైతికత లేదు

అక్షర దర్బార్, వరంగల్: పెట్టుబడిదారీ విధానాలను ప్రోత్సహిస్తూ, శ్రామికుల హక్కులను కాలరాస్తున్న పాలక పార్టీలకు మేడే నిర్వహించే నైతిక హక్కు లేదని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ విమర్శించారు. శుక్రవారం ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా ఓంకార భవన్‌లో మేడే జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచి కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాత కార్మిక చట్టాలను, ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని, పాలకుల వ్యతిరేక విధానాలపై మేడే స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సాంబయ్య, కుమారస్వామి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి సర్పంచ్ ఆర్థిక సాయం

అక్షర దర్బార్, దుగ్గొండి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దారా ఐలయ్య కుటుంబానికి నాచినపల్లి గ్రామ సర్పంచ్ పెండ్యాల రాజు ఐదు వేల రూపాయల ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బాధితులకు ఈ సాయం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన సర్పంచ్, భవిష్యత్తులోనూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాగరబోయిన కట్టయ్య, మండల పార్టీ కార్యదర్శి నర్ర రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మక్కల కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

అక్షర దర్బార్, శాయంపేట: మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బిజెపి మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ డిమాండ్ చేశారు. కేంద్రాల్లో సరిపడా గన్నీ బ్యాగులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రైతులకు కనీస తాగునీరు, విశ్రాంతి కోసం షెడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే బిజెపి తరపున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.



## కార్మిక హక్కుల కోసం
# సమైక్యంగా పోరాడాలి

- ఏఐఎఫ్టీయూ (న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు
- నర్సంపేటలో ఘనంగా 141వ మేడే వేడుకలు
- కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్



అక్షర దర్బార్, నర్సంపేట: చికాగో అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో కార్మిక హక్కుల సాధన కోసం పోరాట పతాకాన్ని ఎత్తి పట్టాలని ఏఐఎఫ్టీయూ (న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెమ్ మల్లేశం పిలుపునిచ్చారు. శుక్రవారం నర్సంపేట పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో 141వ మేడేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పరిశ్రమల కార్మికులతో కలిసి పట్టణంలోని పాకాల సెంటర్ నుండి తెలంగాణ అమరవీరుల స్తూపం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో మల్లేశం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం ద్వారా కార్మిక హక్కులను హరిస్తోందని విమర్శించారు. అసంఘటిత రంగ కార్మికులకు కనీస సౌకర్యాలు లేక శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఈర్ల పైడి, ఎల్లన్న, శ్రీలత, యాకన్న మరియు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్ రద్దు చేసేవరకు పోరాడతాం

- సీఐటీయూ
- పరకాలలో కార్మికుల భారీ ర్యాలీ

అక్షర దర్బార్, పరకాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేసే వరకు మేడే స్ఫూర్తితో పోరాటాలు కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా కోశాధికారి బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా శుక్రవారం పరకాల పట్టణంలో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి, పని గంటలను 8 నుండి 12 గంటలకు పెంచి కార్మికులను బానిసలుగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ హక్కులను హరించడాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్, వివిధ కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.




## అర్హులైన విద్యార్థులకు 'ప్రతిభా పురస్కార్' అవార్డులు



అక్షర దర్బార్, సంగెం: ఇంటర్మీడియట్ మరియు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రముఖ సామాజిక సేవకులు పులి రాజశేఖర్ ఆధ్వర్యంలో 'ప్రతిభా పురస్కార్' అవార్డులు అందజేయనున్నారు. ఇంటర్మీడియట్‌లో 900 మార్కులు, పదో తరగతిలో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు ఈ అవార్డులకు అర్హులని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ మెమో, ఆధార్ కార్డు, ఫోటో వివరాలను ఈనెల 15వ తేదీ లోపు 9133700833 నంబర్‌కు వాట్సాప్ చేయాలని కోరారు. దాతల సహకారంతో ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తామని రాజశేఖర్ పేర్కొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాలి

అక్షర దర్బార్, పరకాల: మేడే సందర్భంగా పరకాల మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట కార్మిక సంఘం అధ్యక్షుడు మడికొండ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో ఎర్రజెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. నిరంతరం పట్టణ పరిశుభ్రత కోసం శ్రమిస్తున్న తమకు కనీస వేతనాలు, వసతులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలు తెచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేసి, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సారయ్య, ఐలయ్య, సరోజన తదితర కార్మికులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

- సర్పంచ్ సరోజన

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండలం తహరాపూర్ పాఠశాలలో ఈ ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమని గ్రామ సర్పంచ్ కుక్కల సరోజన అన్నారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఆమె శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. నిపుణులైన ఉపాధ్యాయులు, మెరుగైన భవనాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడం ఆందోళనకరమన్నారు. తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా మన ఊరి బడిని కాపాడుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు.





## ఉపాధి హామీ కార్మికులకు మజ్జిగ పంపిణీ

అక్షర దర్బార్, శాయంపేట: అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని హుస్సేన్‌పల్లి గ్రామంలో ఉపాధి హామీ కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ ఎడ్ల స్వరూప సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎండ తీవ్రత దృష్ట్యా కార్మికుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామ అభివృద్ధిలో కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని, వారి సంక్షేమానికి పంచాయతీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మణరావు, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ మరియు కార్మికులు పాల్గొన్నారు.

### 22వ వార్డులో ఇందిరమ్మ


## ఇంటి గృహప్రవేశం

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని 22వ వార్డులో మాల మమత-మహేందర్ దంపతులు ఇందిరమ్మ పథకం ద్వారా నిర్మించుకున్న నూతన గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక కౌన్సిలర్ అల్లే దశరథం, వార్డు అధ్యక్షుడు కేశబోయిన అజయ్‌కుమార్ హాజరై దంపతులను శాలువాతో సత్కరించి నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సొంతింటి కలలను నిజం చేస్తోందని, అర్హులైన వారందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## నవ వధూవరులను ఆశీర్వదించిన సోదా రామకృష్ణ

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని జి.ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన అఖిల-నరేష్‌ల వివాహ వేడుకకు మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆయన పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మడికొండ సంపత్‌కుమార్, మార్క రఘుపతి గౌడ్, ఏకు రాజు, మాజీ సర్పంచ్ అల్లం రఘునారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

○ ఏఎంసీ చైర్మన్

అక్షరదర్బార్, పరకాల: రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పరకాల ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి సూచించారు. శుక్రవారం నాగారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేడ్-ఏ రకానికి ₹2,389, సాధారణ రకానికి ₹2,369 మద్దతు ధరతో పాటు సన్న రకానికి క్వింటాలుకు ₹500 బోనస్ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏరుకొండ రమాదేవి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





### పశువుల సంతలో టీ స్టాల్..

## అనుమతి ఎవరిది?

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని పశువుల సంత ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన టీ స్టాల్‌పై స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కుంకుమేశ్వర ఆలయానికి చెందిన ఈ స్థలాన్ని మున్సిపాలిటీకి లీజుకు ఇచ్చినట్లు సమాచారం ఉండగా, ఇప్పుడు అక్కడ ప్రైవేట్ వ్యాపారానికి అనుమతి ఎవరు ఇచ్చారనే సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ స్థలంలో మున్సిపాలిటీ అనుమతితో అద్దె వసూలు చేస్తున్నారా లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

## పెద్దకుంటపల్లిలో హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన

○ పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్సార్

అక్షర దర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పెద్దకుంటపల్లిలో శుక్రవారం నిర్వహించిన హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో స్థానిక శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని, దేవాలయాలు శాంతి కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని, దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు , భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలి

○ ఏఐటీయూసీ నేత బండి నరసయ్య


అక్షర దర్బార్, వెంకటాపూర్: దేశంలోని 44 కార్మిక చట్టాలను ప్రభుత్వాలు యథావిధిగా కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బండి నరసయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మే డే సందర్భంగా వెంకటాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ మామిడిశెట్టి సుగుణతో కలిసి ఆయన జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 8 గంటల పని దినం కోసం వేలాది మంది కార్మికులు ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. నేడు కేంద్ర ప్రభుత్వం పని గంటలను 12 గంటలకు పెంచేలా చట్టాలను సవరించడం దారుణమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిబోసి ప్రధాన కార్యదర్శి కొక్కుల రాజేందర్, గ్రామ పంచాయతీ సిబ్బంది, హమాలీలు పాల్గొన్నారు.



## కోతుల గుంపు దాడి

○ తప్పించుకునే క్రమంలో పడి వ్యక్తి మృతి

అక్షర దర్బార్, భూపాలపల్లి: జిల్లా కేంద్రంలోని జవహర్ కాలనీలో కోతుల గుంపు దాడి చేయడంతో, వాటి నుండి తప్పించుకునే క్రమంలో పడి గాయపడిన ఒక వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. భూపాలపల్లి పట్టణ సిఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన కొసన గొట్టు హరికృష్ణ (50) ఏప్రిల్ 30న తన ఇంటి వద్ద ఉన్న కోతుల గుంపును తరిమేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో కోతులు ఒక్కసారిగా ఆయనపైకి రావడంతో, భయంతో పరుగు తీస్తుండగా కాలు జారి పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించి గురువారం రాత్రి ఆయన మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.






## అన్వితకు కలెక్టర్ చేతుల మీదుగా 'ప్రతిభా పురస్కారం'

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ (బాలికల) పాఠశాల విద్యార్థిని బాసని అన్విత జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభా పురస్కార పత్రాన్ని అందుకున్నారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. అన్విత సాధించిన విజయం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయ బృందం మరియు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేఖర్ బాబు, రంజిత్ కుమార్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మ వీరస్వామి కుటుంబాన్ని పరామర్శించిన చల్లా ధర్మారెడ్డి

అక్షర దర్బార్, సంగెం: సంగెం మండలం పల్లారుగూడ గ్రామ ఉప సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు బొమ్మ కొటేష్ తండ్రి బొమ్మ వీరస్వామి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం వారి నివాసానికి వెళ్లి వీరస్వామి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. పార్టీ కార్యకర్తల కుటుంబాలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, పసునూటి సారంగపాణి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



## తప్పిన పెను ప్రమాదం.. ఎస్సై చాకచక్యం

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని హుజురాబాద్ రోడ్డులో గల పంట భూముల్లో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించగా, ఎస్సై రమేష్ నాయక్ సకాలంలో స్పందించి పెను ప్రమాదాన్ని తప్పించారు. పంట అవశేషాలను తగులబెట్టడంతో చెలరేగిన మంటలు ఒక్కసారిగా వ్యాపించి సమీపంలోని పొలాల్లోని కరెంటు వైర్లు, మోటార్ పైపులను దగ్ధం చేశాయి. మంటలు పక్కనే ఉన్న సామిల్‌కు అంటుకోబోతుండటంతో స్థానికులు ఆందోళన చెందారు. గమనించిన ఎస్సై వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, బోరు మోటార్ సాయంతో నీళ్లు చల్లి మంటలను అదుపు చేశారు. సామిల్‌కు మంటలు వ్యాపించకుండా ఆపడంతో భారీ నష్టం తప్పిందని, ఎస్సై చూపిన చొరవ అభినందనీయమని స్థానికులు కొనియాడారు.









## అయూబ్ జన్మదినానికి శుభాకాంక్షల వెల్లువ


- సీఎం రేవంత్ రెడ్డితో సహా పలువురు నేతల ఆశీస్సులు

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ తన జన్మదిన సందర్భంగా ఆశీస్సులు అందజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్, వేం నరేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపిన దొంతి మాధవ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కెఆర్ నాగరాజు, యశస్విని రెడ్డి, బసవ రాజు సారయ్య, ఎంపీ కడియం కావ్యతో పాటు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

## వీధి వ్యాపారులకు 'జనతా ట్రస్ట్' చేయూత

- నిరుపేదలకు తోపుడు బండ్లు, వ్యాపార సామగ్రి పంపిణీ
- 200 కుటుంబాలకు 'ఎగ్ కోర్టు'లు ఇప్పిస్తాం: డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

అక్షర దర్బార్, నర్సంపేట: చిరు వ్యాపారుల జీవనోపాధిని బలోపేతం చేసే లక్ష్యంతో జనతా ట్రస్ట్ మరియు నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ సంయుక్తంగా వీధి వ్యాపారులకు చేయూతనిచ్చాయి. శుక్రవారం నర్సంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో గుడ్లు, అల్పాహార వ్యాపారం చేసుకునే నిరుపేద కుటుంబాలకు తోపుడు బండ్లు, గొడుగులు, గ్యాస్ స్టవ్‌లు, తూనికలు మరియు పాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనతా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. వీధి వ్యాపారులు ఆర్థిక వ్యవస్థలో కీలకమని, వారు గౌరవప్రదమైన జీవనం సాగించాలనే ఉద్దేశంతోనే ఈ సామగ్రిని అందజేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గవ్యాప్తంగా 200 పైగా కుటుంబాలకు 'ఎగ్ కోర్టు'లు ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎగ్ కోర్ట్ కోఆర్డినేటర్ కొర్ర రాజీవ్ మాట్లాడుతూ.. 'మై ఎగ్, మై లైఫ్, మై ప్రైస్' నినాదంతో పౌల్ట్రీ రైతులతో పాటు చిరు వ్యాపారుల మార్కెటింగ్ అవకాశాలను మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గూడూరు సందీప్, తడుక వినయ్ గౌడ్, అచ్చ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.






## రోహిత్‌కు 'శ్రామిక్ శక్తి' అవార్డు ప్రదానం

అక్షర దర్బార్, హనుమకొండ: విద్యుత్ శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న రోహిత్ ప్రతిష్టాత్మక 'శ్రామిక్ శక్తి' అవార్డును అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కాంగ్రెస్ భవన్‌లో నిర్వహించిన మేడే వేడుకల సందర్భంగా, యూనియన్ రాష్ట్ర నాయకుల చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. వరంగల్ 327 యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న రోహిత్‌కు అవార్డు రావడం పట్ల కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగులు మరియు మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను అమ్మమ్మ, తాతయ్యలు మల్యాల సరళ–రాజయ్యలు శాలువాతో ఘనంగా సత్కరించారు.

## నీట్ పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు

- ఎస్పీ సంకీర్త్
- పరీక్ష కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు బంద్
- భూపాలపల్లి జిల్లాలో పటిష్ట పోలీస్ బందోబస్తు

అక్షర దర్బార్, భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మే 3వ తేదీన నిర్వహించనున్న నీట్ (UG)–2026 ప్రవేశ పరీక్షల దృష్ట్యా పరీక్ష కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ (గతంలో 144 సెక్షన్) అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. పరీక్ష రోజు మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధమని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ మరియు జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, అక్కడ పటిష్ట బందోబస్తు ఉంటుందని వెల్లడించారు. పరీక్ష సమయంలో పరిసరాల్లోని ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లు మరియు స్టేషనరీ దుకాణాలు మూసి ఉంచాలని ఎస్పీ ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు తీసుకురావద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



# కార్మికులకు అండగా ప్రభుత్వం

- రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- జెండా ఆవిష్కరించి కార్మికులకు మే డే శుభాకాంక్షలు



అక్షరదర్బార్, వరంగల్: కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వరంగల్ లక్ష్మీపురం మార్కెట్ లో జరిగిన మే డే కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జెండా ఆవిష్కరించి కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్మికులకు అండగా ఎల్లప్పుడూ ప్రభుత్వం నిలుస్తుందని, వారికి భీమా ప్రయోజనాలు, సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన పెంపొందించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంఓ సురేఖ, సంబంధిత అధికారులు, 27వ డివిజన్ కార్పొరేటర్ అనిల్, కార్మిక సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# 7న స్టేషన్ ఘనపూర్‌కు భట్టి

- రూ.65 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఏర్పాట్లపై సమీక్షించిన ఎమ్మెల్యే శ్రీహరి, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



అక్షరదర్బార్, హనుమకొండ: స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఈ నెల 7న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు సుమారు రూ.65 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. శుక్రవారం హన్మకొండలోని నక్కలగుట్ట విద్యుత్ భవన్‌లో ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డిని కలిసి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, పీచర 132 కేవీ సబ్ స్టేషన్‌తో పాటు కొండాపూర్, సాగరం, కుర్చపల్లి ప్రాంతాల్లోని 33/11 కేవీ సబ్ స్టేషన్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. జఫర్ గఢ్ 132 కేవీ సబ్ స్టేషన్‌తో పాటు నష్కల్, పల్లగుట్ట, లింగంపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ సబ్ స్టేషన్లకు శంకుస్థాపనలు జరగనున్నాయని వివరించారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) వి మోహన్ రావు, జనగామ ఎస్ఈ సంపత్ రెడ్డి, హన్మకొండ ఎస్ఈ మధుసూదన్ రావు, ట్రాన్స్ కో వరంగల్ ఎస్ఈ నారాయణరెడ్డి, జనగామ ఎస్ఈ రాజశేఖర్, డివిజనల్ ఇంజినీర్లు లక్ష్మీనారాయణరెడ్డి, సారయ్య, విజయేందర్ రెడ్డి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల్లో నమ్మకాన్ని కలిగించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, హనుమకొండ: పోలీసుల వద్దకు వెళ్తే న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులకు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నూతనంగా ఇన్ స్పెక్టర్ల నుండి ఏసీపీలుగా పదోన్నతి పొందిన గొర్ల సీతారెడ్డి, బోలగాని శ్రీనివాస్ గౌడ్, సార్ల రాజు శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను సీపీ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ పదోన్నతులతో పాటు బాధ్యతలు పెరుగుతాయని, నిరంతరం క్రింది స్థాయి అధికారుల పని తీరును పర్యవేక్షణ చేయడంతో వారికి దిశా నిర్దేశం చేయాలని, పోలీస్ శాఖ గౌరవ మర్యాదలు పెంపొందించే విధంగా విధులు నిర్వర్తించాలని అధికారులకు సూచించారు.



# ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి సీతక్క
- ములుగులో 'బాల భరోసా' కార్యక్రమం ప్రారంభం




అక్షర దర్బార్, ములుగు: ఆరోగ్య తెలంగాణ నిర్మాణమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. శుక్రవారం ములుగు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆర్బీఎస్కే విభాగాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'బాల భరోసా' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆరు సంవత్సరాల లోపు చిన్నారుల్లో పుట్టుకతో వచ్చే శారీరక, మానసిక లోపాలను ముందస్తుగా గుర్తించి, వారికి మెరుగైన వైద్యం అందించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. చిన్నారుల్లో అనారోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే పసిగట్టడం ద్వారా వారికి ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించవచ్చని ఆమె వివరించారు. జిల్లా సంక్షేమ అధికారిణి ఈ.పి. ప్రేమలత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, ఐసీడీఎస్ అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు నియోజకవర్గ స్థాయి సభలు

- సభల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- 4 నుండి 9 వరకు 'రైతు వారోత్సవాలు'
- డివిజన్ స్థాయిలోనూ 'ప్రజావాణి' నిర్వహణ
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి వెల్లడి




అక్షరదర్బార్, హనుమకొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, ఈ నెల 2న జిల్లాలో నియోజకవర్గ స్థాయి సమావేశాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉదయం వేళల్లోనే ఈ సభలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం సభ హనుమకొండ కలెక్టరేట్, పరకాల నియోజకవర్గం సభ మహాదేవ ఫంక్షన్ హాల్ లో జరగనుందని ప్రకటించారు.

**రైతు వారోత్సవాలు - ధాన్యం సేకరణ**

ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 'రైతు వారోత్సవాలు' నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ట్యాబ్ ఎంట్రీలు, గన్నీ బ్యాగుల సరఫరా, రవాణా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

**డివిజన్ స్థాయికి 'ప్రజావాణి'**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజావాణి'ని ఇకపై రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్డీఓల ఆధ్వర్యంలో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. దరఖాస్తులను నెల రోజుల్లోపు పరిష్కరించాలి. తిరస్కరించిన దరఖాస్తులకు సరైన కారణాలు తెలపాలి. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు స్థితిని తెలుసుకునే సదుపాయం కల్పించాలి. వచ్చే ప్రజలకు తాగునీరు, నీడ, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, జడ్పీ సీఈవో శేషాద్రి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అగ్నికి ఆహుతి అయిన మొక్కజొన్న పంట

- పరామర్శించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

అక్షరదర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్ళపల్లి మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో చేతికొచ్చిన పంట అగ్నికి ఆహుతి కావడంతో రైతులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. నలుగురు రైతులకు చెందిన ఎనిమిది ఎకరాల మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతి అయింది, చేతికి అంది వచ్చిన మొక్కజొన్న పంటలు కాలి బూడిదయ్యాయి. పక్క పొలంలో వ్యవసాయ వ్యర్థాలు తగులబెట్టేందుకు పెట్టిన నిప్పు గాలికి అదుపుతప్పి మొక్కజొన్న కుప్పలకు వ్యాపించడంతో ఈ దుర్ఘటన జరిగింది. అనీ రైతులు వాపోయారు. రైతులు తమ కష్టార్జితం కళ్లముందే నాశనమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి శాసనసభ్యులు సత్యనారాయణ రావు బాదిత రైతులను పరామర్శించి ప్రభుత్వంతో మాట్లాడి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ వెంట చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ రఫీ తహసిల్దార్ సునీత ఎంపీడీవో సురేందర్ గౌడ్ ఆర్ ఐ శివరామకృష్ణ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ కాంగ్రెస్ పార్టీ మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి. నాయకులు దండా వెంకటేశ్వర రెడ్డి నడిగోటి రాము గూడూరి రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల భద్రతకు పెద్దపీట

**డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతల స్వీకరణ**

అక్షరదర్బార్, హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా జరిగింది. డీజీపీ కార్యాలయానికి చేరుకున్న సీవీ ఆనంద్‌కు పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద మంత్రోచ్చారణల మధ్య, పండితుల ఆశీర్వచనాలతో ఆయన తన కుర్చీలో ఆసీనులయ్యారు. బాధ్యతలు స్వీకరించే ముందు పోలీసు విభాగం నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. పోలీసు బలగాల క్రమశిక్షణ, గౌరవానికి ప్రతీకగా ఈ కార్యక్రమం సాగింది. డీజీపీ కార్యాలయంలోని ఇతర విభాగాల ఉన్నతాధికారులు, ఐపీఎస్ అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ అపురూప ఘట్టానికి సీవీ ఆనంద్ కుటుంబ సభ్యులు కూడా హాజరయ్యారు. తన కెరీర్‌లో అత్యున్నత పదవిని అధిరోహిస్తున్న తరుణంలో కుటుంబం పక్కన ఉండటం ఆయనలో ఉత్సాహాన్ని నింపింది. రాబోయే రోజుల్లో రాష్ట్ర పోలీసింగ్ వ్యవస్థలో ఆయన ఎలాంటి మార్పులు తీసుకువస్తారోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. డీజీపీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్ మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు.